



ఆడెనమ్మా! శివుడు.. పాడెనమ్మా! భవుడు

"మొలక మీసపు గట్టు, ముద్దు చందురుబొట్టు.. పులితోలు హొంబట్టు, జిలుగు వెన్నెల పట్టు.." అంటూ పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవం కావ్యంలో వర్ణించిన దృశ్యం బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తిలో సాక్షాత్కారమైంది. శివుడి ఢమరుకంపై తాండవమాడుతూ సూర్యుడు పడమట అస్తమించగా, తూరుపున పుట్టిన చంద్రుడు స్వర్ణమ్మలో అందాలు దిద్దుకుని, గోపురం మీదుగా ఆకాశానికెగసి, కన్నప్ప కొండమీద కొలువైన శివపార్వతుల సిగలో నగలాగ ఇమిడిన అపురూప దృశ్యాలు ఇవి. అంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ కెమెరాకు చిక్కాయి.







టిప్పర్‌కు మట్టిని లోడ్ చేస్తూ..

ఎర్ర బంగారం

ఎర్ర బంగారం..గా పిలుచుకునే గ్రావెల్ తరలిపోతోంది. వారం కిందటే ఆర్డీవో రెండు హిటాచీలను సీజ్ చేశారు. గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా.. అదే భూముల నుంచి మళ్లీ తవ్వి తరలిస్తున్నారు. అధికారులేమో చూసీ చూడనట్లు ఉంటున్నారు.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి



గ్రావెల్ తవ్వకంతో భారీ గోతులు

తరలిపోతూనే ఉంది

- వారం కిందట యంత్రాలను సీజ్ చేసిన ఆర్డీవో
- మళ్లీ అదే భూముల్లో గ్రావెల్ తవ్వకం.. తరలింపు
- 'అధికార' అండతో చెలరేగిపోతున్న అక్రమ రవాణాదారులు

దొరవారిసత్రం మండలంలోని పూలతోటమిట్ట ఎర్ర బంగారంగా పిలవబడే గ్రావెల్ మట్టి అక్రమ రవాణాకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడి అసైన్డ్ భూముల నుంచి యథేచ్ఛగా తవ్వి.. తరలిస్తున్నారు. ఆ గ్రామంలోని గిరిజనులు, దళితులకు 1982, 1991లో రెండు విడతలుగా 110 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను ప్రభుత్వం పంపిణీ చేసింది. అందులో 40 ఎకరాలు గిరిజనులవి. వీరి భూములను కొందరు దళితులే కొన్నారు. ఈ మెట్ట భూములను 2018లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్‌గా మార్చి పట్టాలు మంజూరు చేసింది. ఆ భూముల్లో సాగు చేసుకోవడం మానేసి గ్రావెల్ అక్రమ రవాణదారులకు రైతులు అమ్ముకొంటున్నారు. ఒక ఎకరాలో గ్రావెల్ తీస్తే రూ.2.5 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఈ ప్రక్రియలో దళారులూ రంగ ప్రవేశం చేశారు. ఇక్కడి గ్రావెల్ నాణ్యమైనది కావడంతో డిమాండు ఎక్కువ. స్థానికంగా జరిగే రైల్వే పనులతో పాటు సూళ్లూరుపేట, తడ, శ్రీసిటీ ప్రాంతాల్లోని పరిశ్రమలు, లేఅవుట్లను చదును చేయడానికి ఇక్కడి గ్రావెల్‌ను తీసుకెళుతున్నారు.

'అధికార' అండతో..

గతంలో టిప్పర్లున్న వారు గ్రావెల్ రవాణా చేసేవారు. ఒక టిప్పరును రూ.8 వేల వరకు విక్రయించేవారు. ఇప్పుడు ఒకరిద్దరు గ్రావెల్‌ను రవాణా చేస్తూ.. ఒక టిప్పర్‌ను రూ.16,800కు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దూరం బట్టి ధరల వ్యత్యాసాలు ఉంటాయి. అధికారంలో ఎవరుంటే వారి అండదండలు అక్రమ రవాణాదారులకు ఉంటున్నాయి.

ఆర్డీవో సీజ్‌చేసిన వాహనం అక్కడే ఉన్నా..

పూలతోటమిట్ట నుంచి గ్రావెల్ రవాణా చేయడంపై స్థానికుల ఫిర్యాదులతో ఈనెల 5వ తేదీన సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అక్కడికి వచ్చారు. అప్పటికే వాహనదారులు టిప్పర్లను తప్పించేశారు. రెండు హిటాచీలను మాత్రం ఆమె సీజ్ చేశారు. ఒకటి పోలీస్ స్టేషన్‌లో.. మరొకటి సంఘటనా స్థలానికి సమీపంలోనే ఉంచారు. ఆ హిటాచీ ఉన్న భూముల్లోనే ఇప్పుడు మళ్లీ గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ విషయం తెలిసీ అధికార యంత్రాంగం కదలకపోవడం విశేషం. దీనిపై తహసీల్దారు శైలకుమారిని వివరణ కోరగా గ్రావెల్ రవాణాపై చర్యలు తీసుకొంటామన్నారు.



ఈ నెల 5న గ్రావెల్ తీసే చోట పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- అర్ధరాత్రి అక్రమ రవాణా
- సమాచారం ఇచ్చినా స్పందించని నిఘా టీం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ఇన్నాళ్లు జగనన్న లే అవుట్ల నుంచి అక్రమంగా మట్టి రవాణా సాగించిన అక్రమార్కులు ఇప్పుడు ఇలుపూరు చెరువుపై పడ్డారు. బుధవారం రాత్రి 8 గంటల నుంచి చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిను తవ్వి ట్రాక్టర్ల ద్వారా సూళ్లూరుపేట సమీపంలో ఉన్న పరిశ్రమలు, లే అవుట్‌లకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్ ఆధ్వర్యంలో వీఆర్వో, వీఆర్ఏలతో నిఘా టీంను ఏర్పాటు చేశారు. ఇలుపూరు గ్రామస్తులు చెరువులో మట్టి తవ్వకాలపై తహసీల్దార్ నరసింహరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన సంబంధిత నిఘా టీంకు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ రావడం గమనార్హం. మట్టి అక్రమ రవాణాను కట్టడిచేసేలా అధికారుల చర్యలు లేవన్న విమర్శలున్నాయి.

ఎన్నో ఇబ్బందులున్నా రూ.25 కోట్లు ఇస్తున్నా

- హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి
- పనుల్లో నాణ్యత లేకపోతే జైలుకు పంపిస్తా
- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఎన్నో ఇబ్బందులు పడి రూ.25 కోట్లు ఇస్తున్నా. మరమ్మతుల పేరుతో ఎవరైనా అవినీతికి పాల్పడితే జైలుకు పంపిస్తా' అంటూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం ఆయన సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. మీ పరిధిలోని హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులకు శనివారంలోపు అంచనాలు పంపాలని, దీనిపై పదేపదే సమీక్షిస్తున్నా కొంతమందిలో మార్పు రావడంలేదన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన సమీక్షా సమావేశానికి బీసీ సంక్షేమశాఖ నుంచి అధికారులు రాకపోవడంపై ఆగ్రహించారు. కుంటిసాకులు చెబితే ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. రెండు రోజుల్లో ప్రతిపాదనలు పంపాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుని హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కొన్ని సంక్షేమ శాఖల్లో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, ఇలాగైతే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. ఒకరిద్దరు అధికారుల తీరు పట్ల తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్సులో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఈఈ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు చంద్రశేఖర్, సూర్యనారాయణ, గురుకుల పాఠశాలల సమన్వయకర్త రేష్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకం కింద సబ్సిడీతో కూడిన రుణాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సామాజిక వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం) ప్రవేశం కోసం బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, అర్హులైన వారు వచ్చే నెల 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995562127ను సంప్రదించాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులను పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేయడానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా పారిశ్రామిక కేంద్రం జీఎం మారుతి ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన అవగాహన, ప్రాజెక్టు ప్రిపరేషన్, పథకాల వివరాలు, మార్కెట్‌పై అవగాహన కల్పిస్తారని వివరించారు. మరిన్ని వివరాలకు 7680863089, 9390786466లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నాగలాపురంలో 'లక్కీ భాస్కర్'!


- బ్యాంకులో చేతివాటం
- రూ.రెండు కోట్లకుపైగా నగలు గోల్‌మాల్

సత్యవేడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని ఓ బ్యాంకులో కీలక విభాగంలో పని చేస్తున్న ఉద్యోగి లక్కీ భాస్కర్ సినిమా తరహాలో చేతివాటం చూపాడు. రూ.రెండు కోట్లకు పైగా నగలు గోల్‌మాల్ చేసినట్లు సమాచారం. సదరు బ్యాంకులో తాకట్టుకోసం పెట్టిన నగలను తన సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఇటీవల బ్యాంకులో సోషల్ ఆడిట్ జరగడంతో నగలకు సంబంధించిన లావాదేవీలలో తేడాలను గుర్తించారు. దీనిపై అధికారులు విచారణ జరపగా విషయం బయటపడినట్లు తెలిసింది. ఏకంగా రూ.రెండుకోట్లకు పైగా నగలకు సంబంధించిన లావాదేవీలలో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించి, అతడిని విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కనీయకుండా విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసులకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు.



కదిరి మోహన ప్రభాకర్‌కు రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన బీఎస్ఎఫ్ మాజీ అసిస్టెంట్ కమాండెంట్ అధికారి కదిరి మోహనప్రభాకర్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని అందుకున్నారు.న్యూఢిల్లీలోని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కదిరి మోహన ప్రభాకర్‌కు 2023కు గానూ బీఎస్ఎఫ్ డైరక్టర్ జనరల్ దల్జీత్‌సింగ్ రాష్ట్రపతి ప్రతిభా సేవా పతకాన్ని(ప్రెసిడెంట్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) అందజేశారు. బీఎస్ఎఫ్‌లో 40ఏళ్ల పాటు నిర్విరామ సేవలందించినందుకు 2023వ సంవత్సరంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్రప్రభుత్వం మోహన ప్రభాకర్‌కు ప్రతిభా సేవా పతకాన్ని ప్రకటించింది. మోహనప్రభాకర్ బీఎస్ఎఫ్ విధి నిర్వహణలో భాగంగా జమ్మూలో పని చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీల్లో సేవలందించారు.ప్రాథమిక పాఠశాల విద్యను కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాలలో, ఉన్నత విద్యను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశాక మోహనప్రభాకర్ 1984మార్చి 19న బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగారు.2024లో అసిస్టెంట్ కమాండెంట్(మినిస్టీరియల్) హోదాలో రిటైరయ్యాక ఏపీ భవన్‌లో లైజన్ అండ్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



మాఘపౌర్ణమి రోజున శేషాచలం కొండల్లోని రామకృష్ణ తీర్థానికి భక్త జనం పోటెత్తారు. తిరుమల ఆలయం నుంచి ఆరుకిలోమీటర్ల దూరం అడవుల్లో ఊరేగింపుగా వెళ్లిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

8లో



ముక్కంటి ఆలయం నుంచి స్వామి, అమ్మవార్లు, వినాయకస్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వర స్వామి, త్రిశూలాన్ని వేంచేపుగా స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. మాఘపౌర్ణమి సందర్భంగా త్రిశూల స్నానఘట్టం నిర్వహించారు.

8లో

చంద్రగిరి

తలకోనలో సాధారణ భక్తుల దర్శనానికి అగ్రాసనం

● ఎమ్మెల్యే పులివర్తి నాని



బ్రహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెలే నాని కూటమి నాయకులు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరస్వామి వార్షిక శివరాత్రి బ్రహోత్సవాల్లో సాధారణ భక్తుల దర్శనానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. బుధవారం సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహోత్సవాల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహోత్సవాల రద్దీని అంచనా వేసుకొని భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈనెల 23 నుంచి 27 వరకు తాగునీరు, ఆహారం, ట్రాఫిక్, వసతుల కల్పన విషయంతో జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలకు ఇబ్బందిలేకుండా పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్రహోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కోనేరు పరిసరాలను పరిశీలించారు. అంతకుముందు ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. పాలక మండలి చెర్మన్ సోమనాథరెడ్డి, ఈవో మమత, అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో బాబ్జీ

పాకాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యత పాటించాలని ఎంఈవో బాబ్జీ వంట తయారీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. స్వయంగా పిల్లలకు వడ్డించి రుచి చూశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన సరకులతో రుచిగా వండి పిల్లలకు వడ్డించాలని కోరారు. మెనూ ప్రకారం తయారుచేయాలన్నారు. వంట తయారు చేసే పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని అన్నారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గరుడ వాహనంపై అధిష్ఠించారు. అనంతరం మాఢవీధుల్లో గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, అర్చకులు, పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటరమణ

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూసదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దారు వెంకటరమణ సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూసదస్సుల్లో 234 ఫిర్యాదులు అందగా 102 సమస్యలను పరిష్కరించామన్నారు. అనంతరం రెవెన్యూప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. డీటీ అన్వర్ బాషా, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను అభివృద్ధి చేసిన దాతకు సత్కారం



భానుప్రకాష్‌రెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థులు

చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలను రూ.5.5 లక్షలతో అభివృద్ధి చేసిన పూర్వ విద్యార్థి,దాత బైరెడ్డి భానుప్రకాష్‌రెడ్డిని బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. దోర్నకంబాల ప్రాథమికోన్నత పాఠశాలలో భానుప్రకాష్‌రెడ్డి చదువుకుని ఉన్నత స్థానంలో ఉన్నారు. తాను చదివిన పాఠశాలకు ఆయన 10 కంప్యూటర్లు, 10 కంప్యూటర్ టెబుల్స్, 10 కుర్చీలు, 25 డెస్కులు వితరణ చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. క్రీడా మైదానం చదును చేయించారు. వంట గదినీ ఆధునీకరణకు చర్యలు తీసుకున్నారు. ఈఅభివృద్ధి పనులకు రూ.5.5 లక్షలు వెచ్చించారు. ఈసందర్భంగా భానుప్రకాష్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రసాదరావు

భాకరాపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు అన్నారు. చిట్టేచర్ల పంచాయతీలో ఫార్మర్ రిజిస్ట్రీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు తరహా రైతుకు 11 అంకెలతో కూడిన యూనికోడ్‌ను కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. తొలుత పీఎం కిసాన్ లబ్దిదారులకు, ఆ తరువాత భూయజమానులందరికీ నంబరు కేటాయిస్తామన్నారు. రైతులందరూ తమ వివరాలను రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయఅధికారి ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. **చంద్రగిరి:** . బుధవారం ఐతేపల్లెలో పొలంబడి కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులతో ముందడుగు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

భాకరాపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సమీకృత వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే మహిళా రైతులు ముందంజ వేస్తారని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. చిన్నగొట్టిగల్లు స్త్రీశక్తి భవన్‌లో బుధవారం మహిళా రైతులకు సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిప్పిరెడ్డిగారిపల్లె, నెల్లుట్లవారిపల్లె పంచాయతీలను ఐఎఫ్‌సీ క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు కలిసికట్టుగా మార్కెటింగ్ చేస్తే మంచి ధరలు పొందవచ్చునన్నారు. పలు అంశాలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ సతీశ్, డీపీఎం షణ్ముగం, పశువైద్యాధికారిణి స్రవంతి, ఏపీవో భార్గవి, ఏపీఎం స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ : లైన్‌మేన్ మృతి



ఆనందరెడ్డి (ఫైల్‌ఫొటో)

ఎర్రావారిపాలెం,ఫిబ్రవరి12,(ఆంధ్ర జ్యోతి) విద్యుదాఘాతంతో ట్రాన్స్‌కో లైన్‌మేన్ ప్రాణాలు కోల్పోయిన వైనమిది. వివరాలు ఇలా...ఉస్తికాయలపెంటకు చెందిన ఆనందరెడ్డి ట్రాన్స్‌కోలో పొరుగుసేవ విధానంలో లైన్‌మన్‌గా పనిచేసేవాడు. బుధవారం దేవరవాండ్లపల్లె సమీపంలో ఇతడు ఓ రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే మరణించాడు. ఆనందరెడ్డికి భార్య, 13ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఇతని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. విద్యుత్‌శాఖ డీఈ రమేష్ బాబు, ఏఈ జ్యోతి ప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై డీవై స్వామి తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న పార్థసారథి

చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): కోదండరామాపురం వద్ద జాతీయ రహదారిలో ఆటో ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు బోడిగుట్టవారిపల్లెకు చెందిన దయాసాగర్, పార్థసారథిలు రుయా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి డ్యూటీ అయ్యాక ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. కోదండరామాపురం వద్దకు రాగానే బైకు టైరు పంక్చరయింది. ఈక్రమంలో పార్థసారథి జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. పార్థసారథి తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రుయా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్దేశిత సమయంలోనే రండి

● భక్తులను కోరిన టీటీడీ

తిరుమల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లలోకి రావాలని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా కోరింది. ఇప్పటికే పలుమార్లు భక్తులకు తెలియజేసినా ఇటీవల కొంతమంది నిర్దేశిత సమయానికి ముందే క్యూలైన్ల వద్దకు వెళ్లి అనుమతించాలని సిబ్బందితో వాగ్వాదానికి దిగడమేకుండా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఇది సరైన పద్ధతి కాదని, కేటాయించిన సమయంలోనే రావాలని కోరింది.

వివాహిత అనుమానాస్పద మృతి

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం ఓ వివాహిత మృతదేహాన్ని అనుమానాస్పదస్థితిలో గుర్తించారు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. క్షేత్రపాలకుని ఆలయానికి సమీపంలోని మరుగునీటి కాలవలో మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించి పోలీసులకు, విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే వారు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మురుగులో కూరుకుపోయిన మృతదేహాన్ని హెల్త్ సిబ్బంది సహకారంతో బయటకు తీశారు. వారంరోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అక్కడ లభించిన ఫోన్‌బుక్ ఆధారంగా మృతురాలు సంగారెడ్డికి చెందిన అరుణజ్యోతి(29)గా గుర్తించారు. విచారించగా మహిళకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నట్టు తేలింది.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుడు గోపి (45) ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతి రూరల్ సీఐ చిన్నాగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర నగర్‌లో కాపురమున్న గోపి భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఇతడు ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఇంటి తలుపులు మూడు రోజులుగా తీయలేదు. గది నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య చందన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

తిరుపతి (నేర విభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడిపిన 18 మందిని ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా.. బుధవారం ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున రూ.1.8 లక్షల జరిమానా విధించారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన చక్రేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణంలో శివలింగాకృతితో ఏర్పాటు చేసిన దీపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు వెనుకంజ

● విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు

● వైసీపీ హయాంలో విద్యుత్ సర్వీసుల మంజూరు

● ఇప్పటికీ పట్టించుకోని విద్యుత్ అధికారులు



ప్రభుత్వ భూమిలో ఇటు నిర్మాణాలు..సమీపంలో హెచ్చరిక బోర్డు

చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలో తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న విలువైన ప్రభుత్వ భూమిలో వైసీపీ హయాంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారు. నాగపట్ల రెవెన్యూ లెక్క దాఖల్లో సర్వే నెంబర్ 80-ఏలో 8.31 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. పక్కనే మామిడితోపు పోరంబోకు స్థలంగా ఉంది. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంత మంది కబ్జా చేయాలని ప్రయత్నించడంతో అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈభూమికి హద్దులు నాటి, ఇది ప్రభుత్వ భూమి అని, హెచ్చరిక బోర్డు కూడా పెట్టారు. సమీపంలో ప్రముఖ విద్యాసంస్థ ఉండటంతో ఈ భూములకు డిమాండ్ ఉంది. ఇంటి అద్దెలు కూడా ఎక్కువే. దీంతో ఆగ్రామానికి చెందిన కొంతమంది గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అండదండలతో కొంత భూమిని ఆక్రమించారు. తాత్కాలికంగా 11 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అందులో ఏడు ఇళ్లకు విద్యుత్ మీటర్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలకు విద్యుత్ సర్వీసులు ఇవ్వకూడదని విద్యుత్ శాఖ అధికారులకు అప్పట్లో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు రాతపూర్వకంగా తెలియజేశారు. అధికారులు స్పందించలేదు. సర్వీసులను తొలగించలేదు. రెవెన్యూ, విద్యుత్ అధికారులు సమన్వయంతో స్పందిస్తే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడుతుంది. లేకుంటే మరిన్ని నిర్మాణాలు చేపట్టే అవకాశముంది.

నేడు కోదండరామాలయంలో పేటోత్సవం



పుష్పాలతో ఆలయం ముస్తాబు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేసీపేటలోని కోదండరామస్వామి ఆలయంలో గురువారం పేటోత్సవం జరగనుంది. ఇందుకోసం ఆలయాన్ని సుందరంగా విద్యుద్దీపాలతో, పూలతో ముస్తాబు చేశారు. చలువ పందిళ్లు, మామిడి తోరణాలు, అరటిమాకులతో అలంకరించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా కోదండరామస్వామి ఉత్సవ మూర్తులను ఉదయం 6 గంటలకు చిన్నబజారువీధి, రాయలచెరువు రోడ్డు మీదుగా ఊరేగింపుగా కేసీపేట గ్రామానికి తీసుకువెళ్లారు. అనంతరం స్నపన తిరుమంజనం, ఆస్థానం, ఊంజల్‌సేవ, గ్రామోత్సవం నిర్వహించాక ఆలయానికి ఉత్సవమూర్తులను తీసుకువెళ్తారు.

రూ.22.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చిగురువాడ గ్రామపంచాయతీ పరిధిలో 374మీటర్ల పొడవు, 12 అడుగుల వెడల్పుతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో ఎన్‌ఆర్‌ఈజీఎస్(రూ.16.5లక్షలు), గ్రామ పంచాయతీ నిధుల(రూ.6లక్షలు)తో గ్రామ దింపుడుకల్లం నుంచి శివాలయం వరకు రోడ్డే నిర్మిస్తున్నారు. గతంలో ఈరోడ్డు గుంతలమయంగా ఉండేది. శివాలయానికి వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బందులు పడేవారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడు హరినాయుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. పెనుమూరు మండలం వేమురువాండ్ల పల్లెకు చెందిన పాపయ్యనాయుడు చంద్రగిరి మండలం కొత్తపేటలోని రామచంద్రనగర్‌లో ఇటీవల హతమైన సంగతి తెలిసిందే. వివరాలివి.. పూతలపట్టు మండలం సిరిపురానికి చెందిన రాజేష్, హరినాయుడులు అన్నదమ్ములు. వీరికి ఆస్తుల వివాదాలు ఉన్నాయి. రాజేష్ పక్షాన పాపయ్యనాయుడు నిలిచాడు. ఈక్రమంలో ఇటీవల పాపయ్యనాయుడి ఇంటికి హరినాయుడు వచ్చి దాడి చేసి గొంతు నులిమాడు. అపస్మారకస్థితిలో పాపయ్యనాయుడ్ని అతని కుమారుడు హరీష్ తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ ఈనెల8న మృతి చెందాడు. సంఘటనపై మర్నాడు హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు హరినాయుడు బుధవారం శ్రీనివాసమంగాపురంలోని శ్రీవారిమెట్టు సర్కిల్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. వెంటనే అరెస్ట్ చేసి నిందితుడి కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

లక్ష్మీరెడ్డి తెలియదని కాణిపాకంలో ప్రమాణం చేస్తావా?

● అభినయ్‌కి కిరణ్‌రాయల్ సవాల్



తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తనపై ఆరోపణలు చేస్తున్న లక్ష్మీరెడ్డి అభినయ్‌రెడ్డికి తెలియదని కాణిపాకంలో ప్రమాణం చేయగలడా అంటూ జనసేన నేత కిరణ్ రాయల్ సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ సోషల్ మీడియా నాపై విషప్రచారం చేస్తోంది. ఇందుకు రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నట్లు ఓ సన్నిహితుడి ద్వారా తెలిసింది. గతంలో నా మొబైల్ తస్కరించి వాటి ద్వారా మార్ఫింగ్ చేస్తూ నన్ను, జనసేన పార్టీని తప్పుగా చూపించి డ్యామేజ్ చేయాలన్న కుట్రలో భాగంగానే ఇవన్నీ జరుగుతున్నాయి. మహిళను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయడం వీరికే చెల్లింది. వైసీపీ ట్రాప్‌లో లక్ష్మీరెడ్డి పడింది. వారి అండతోనే నాపై లేనిపోని నిందారోపణలు చేస్తోంది' అని కిరణ్ రాయల్ అన్నారు. తనకు నామినేటెడ్ పోస్టు రాకుండా చేయడానికి వైసీపీ నాయకులు ఇలాంటి కుట్రలు పన్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదగకుండా చేయాలన్న ప్రధాన కుట్రలో భాగంగానే అభినయ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఇలాంటి పథకాలు రచిస్తున్నారని, ఎన్నికుట్రలు పన్నినా భయపడనని చెప్పారు.

రుయా నేత్రనిధికి కళ్లు దానం



కళ్లను దానం చేస్తున్న ధృవీకరణ పత్రాన్ని టెక్నీషియన్‌కు అందజేస్తున్న బాధితులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందిన లీలావతి(61) కళ్లను ఆమె కుమారుడు సిద్ధారెడ్డి రుయాస్పత్రిలోని నేత్రనిధికి దానం చేశాడు. కడప జిల్లా చియపాడుకు చెందిన లీలావతి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు కళ్లు దానం చేయడంవల్ల చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించే అవకాశం ఉంటుందంటూ అవయవదానంపై అవగాహన కల్పించారు. లీలావతి కుమారుడు సిద్ధారెడ్డి తన తల్లి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆయన అనుమతితో నేత్ర విభాగ టెక్నీషియన్ రమేష్ సహకారంతో మృతురాలి కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్రనిధిలో భద్రపరిచారు. తల్లిని కోల్పోయిన దుఃఖంలోనూ ఆమె కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన సిద్ధారెడ్డిని వారి కుటుంబ సభ్యులను రుయా అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా కంటి విభాగాధిపతి చలపతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా మృతిచెందితే సకాలంలో వారి కళ్లను దానం చేయడం వలన కంటి చూపులేని మరొకరికి కంటి వెలుగు ప్రసాదించవచ్చన్నారు. కళ్లను దానం చేయాలనుకునే వారు రుయాస్పత్రిలోని నేత్రనిధిని సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

చంద్రగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి గతేడాది మార్చి వరకు సుమారు రూ.కోట్లతో చేపట్టిన 620 అభివృద్ధి పనులపై గురువారం నుంచి క్షేత్రస్థాయిలో సామాజిక బృందం తనిఖీ చేయనున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. సామాజిక బృందం తనిఖీ ఎస్‌ఆర్పీ రవి, ఎంపీడీవో శేఖర్, ఏపీవో జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

సైకంను కలిసిన డిప్యూటీ మేయర్



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ బుధవారం సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్సీ మునికృష్ణకు ఆయన అభినందనలు తెలిపారు.

బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో గతేడాది నవంబరులో నిర్వహించిన బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

నోటికి రిబ్బన్లతో వెటర్నరీ విద్యార్థుల నిరసన



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైపండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం పదవ రోజుకు చేరుకుంది. వర్సిటీ ప్రధాన గేటు వద్ద దీక్షా శిబిరంలో బైఠాయించి నోటికి నల్లరిబ్బన్లు ధరించి, మౌన నిరసన తెలిపారు. స్టైపండ్ పెంచాలి.. ఉయ్ వాంట్ జస్టిస్.. పశువైద్య విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి.. అన్న ప్లకార్డులను ప్రదర్శించారు.

15న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ శనివారం పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ పట్టాభి తెలిపారు. మేళాలో పలు బహుళ జాతీయ కంపెనీలు పాల్గొననున్నట్లు వివరించారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్, ఐటీఐ, బీటెక్, డిప్లమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువత అర్హులన్నారు. యువతీ యువకులు తమ ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్సులు, బయోడేటాతో పాటు జాబ్‌కార్డుతో మేళాకు ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు.

సాంకేతిక సమస్యలతో సబ్సిడీ రుణ లబ్ధిదారుల ఇక్కట్లు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను సాంకేతిక(టెక్నికల్) సమస్యలు వెంటాడుతున్నాయి. బుధవారం నాటికి స్వయం ఉపాధి పథకం, స్పెషల్ స్కీమ్ కింద 2,936 యూనిట్లకుగాను 16,398 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.32.70 కోట్ల సబ్సిడీ, రూ.3.70 కోట్ల బ్యాంకు రుణాన్ని మంజూరు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ సాంకేతికంగా తలెత్తిన సమస్యలతో లబ్ధిదారులంతా ఎంపీడీవో, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఆధార్, రేషన్ కార్డులే ప్రామాణికంగా..

ఆధార్, రేషన్‌కార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంది. ఆ మేరకు దరఖాస్తులో యూనిట్ పేరు, జిల్లా, మండలం పేర్లను లబ్ధిదారులు నమోదు చేయాలి. ఇక్కడే సమస్య తలెత్తింది. చాలామంది ఉమ్మడి చిత్తూరు జిల్లాగా ఉన్నప్పుడు ఆధార్ కార్డు తీసుకుని ఉన్నారు. ప్రస్తుతం గతంలో చిత్తూరు జిల్లాలో ఉండిన కొన్ని మండలాలు తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో తమ ఆధార్ కార్డు ఆధారంగా దరఖాస్తు చేసేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సమస్య తలెత్తుతోందిలా..

ఉదాహరణకు.. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఓ వ్యక్తి రుణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి నెట్‌సెంటర్‌కు వెళ్లాడు. తన ఆధార్ కార్డు ఇవ్వగా అందులో చిత్తూరు జిల్లా అని ఉంది. ఆ ప్రకారమే నెట్ సెంటర్ నిర్వాహకుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేసరికి శ్రీకాళహస్తి కనిపించడం లేదు. అయినా దరఖాస్తులను సమర్పించేస్తున్నారు. దీని వల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి దరఖాస్తులు వందల సంఖ్యలో ఉన్నాయి. వీరంతా ఎంపీడీవో, మున్సిపల్, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.జిల్లా, మండల అధికారులకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చినప్పటికీ అది పనిచేయడం లేదు. ఈ కారణంగా తమ దరఖాస్తులు ఎక్కడ తిరస్కరణకు గురవుతాయో అన్న ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. ఎడిట్ ఆప్షన్ పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



దరఖాస్తు రిజిస్ట్రేషన్ ఫారం

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడవచ్చునని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్(1104) 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. యూనియన్ డిస్కం కార్యదర్శి వి.దేవేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. 224 మంది కార్మికులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లు, పండ్లు, చల్లని పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సీజీఎం కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జీఎం పి.మురళి, ఏవో సురేంద్ర, నరేంద్ర, ఎస్ఏవో శ్రీనివాసులు, ఈఈ వాసవీలత, యూనియన్ నాయకులు వెలగటూరి గోపి, శైలజ, ఏఏవో శ్రీనివాసులు, ఉమ్మడి తిరుపతి సర్కిల్ పరిధిలోని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

14న గిరిజన భవన్‌లో షికారీల సమ్మేళనం



సమ్మేళన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని గిరిజన భవన్ వేదికగా ఈనెల 14వ తేదీన షికారీల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ ఆదిమ మహాసంఘ్ ముఖ్య సలహాదారు మల్లి సుబ్బారావు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ షికారీలకు ప్రభుత్వ పథకాలు, విద్య అందడం లేదన్నారు. విముక్త సంచార జాతులుగా పేర్కొనే తమను ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించాలని కోరారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 350 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్న ఈ సమ్మేళనంలో షికారీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అనంతరం సమ్మేళనం బ్రోచర్లను ఆవిష్కరించారు.

స్విమ్స్ ప్రకటన రాజ్యాంగ విరుద్ధం : సీపీఎం

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆస్పత్రిలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 4 రేడియాలాజికల్ ఫిజిక్స్ (మెడికల్ ఫిజిసిస్ట్) అధ్యాపక ఉద్యోగాలకు హిందువులు మాత్రమే అర్హులని రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా ప్రకటన చేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్యగా సీపీఎం భావిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీటీడీ ఆలయాల్లో పూజలు, ఇతర కైంకర్యాలు చేసే ప్రదేశాల్లో మాత్రమే మతం అంశం పరిగణనలో ఉండాలని తెలిపారు. పరిపాలన, విద్య, వైద్యం, రవాణా తదితర రంగాల్లో మతం పేరిట వివక్ష చూపడం సమంజసం కాదని పేర్కొన్నారు. తక్షణం ఆ ప్రకటనను ఉపసంహరించుకోవాలని కోరారు.

16న లక్ష్మీ హయగ్రీవార్చన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన తిరుపతిలో లక్ష్మీ హయగ్రీవ అష్టోత్తర శతనామావళి అర్చన నిర్వహించనున్నట్లు గోవిందరాజస్వామి సన్నిధి వీధిలోని పరకాలస్వామి మఠం అర్చకుడు గోవిందరాజన్ తెలిపారు. విద్యార్థుల్లో జ్ఞాన వృద్ధి, మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ సామూహిక అర్చన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసం 9444724680లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



వాహనసేవ ముందు జీయర్ స్వాములు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏడు రోజులుగా జరిగిన గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం ఆలయంలో ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి పుష్కరిణికి వేంచేపు చేశారు. సాయం సంధ్యవేళ నిండు పున్నమి కాంతులీనుతుండగా రంగురంగుల విద్యుద్దీపాల నడుమ స్వామివారు తెప్పలపై ఏడు పర్యాయాలు ప్రదక్షిణం చేస్తూ భక్తులను కటాక్షించారు. పుష్కరిణి చుట్టూ మెట్లపై, భవనాలపై భక్తులు, ప్రయాణికులు పెద్దసంఖ్యలో తెప్పోత్సవాలను కనులారా తిలకించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని, హారతులు పట్టారు. ఈ సందర్భంగా హిందూధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల జియ్యర్‌స్వాములు, డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమం, రక్షణ దిశగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లాస్థాయి బాలల సంక్షేమ, రక్షణ కమిటీని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 18ఏళ్ల లోపు వారి రక్షణ కోసం గ్రామ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భిక్షాటన చేసే బాలలను గుర్తించి, షెల్టర్ హోమ్‌కు తరలించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, మహిళా డీఎస్పీ శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధికి అధికారి లోకనాథం, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కోరారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేయాలన్న ఆలోచన వెంటనే విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు, పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. టీటీడీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం తిరిగి ప్రారంభించాలని కోరారు.

అంగన్‌వాడీల సమస్యలపై 16 నుంచి ఆందోళన

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు పోరాటాలు చేయాలని నాయకులు నాగసుబ్బారెడ్డి, లలితమ్మ కోరారు. సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వేద వర్సిటీ అభివృద్ధికి కృషి
రిజిస్ట్రార్ భాస్కరుడు



రిజిస్ట్రార్‌ను అభినందిస్తున్న వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ వర్సిటీ నూతన రిజిస్ట్రార్ డాక్టర్ పోకల భాస్కరుడు అన్నారు. గురువారం ఆయన యూనివర్సిటీలో అధికారులు, ఉద్యోగుల సమావేశంలో మాట్లాడారు. వేద విజ్ఞాన వ్యాప్తి కోసం అంకితభావంతో పనిచేస్తానన్నారు. ప్రభుత్వ, టీటీడీ సహకారంతో యూనివర్సిటీ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పురోగతిని సాధించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను 27 నుంచి 47 శాతానికి పెంచి అమలు చేయాలని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 1990లో ఉన్న ఓబీసీల జనాభా నిష్పత్తి ప్రకారం నిర్ణయించిన 27శాతం రిజర్వేషన్లను అమలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు స్పందించి రిజర్వేషన్ పెంచే దిశగా కృషి చేయాలని కోరారు. విద్యార్థి సంఘ నాయకులు విజయ్ ఉత్తరాది, సాయి పాల్గొన్నారు.

ఎస్వీయూ రిటైర్డు ప్రొఫెసర్ మృతి



రామ్మూర్తి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సైకాలజీ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ పీవీ రామ్మూర్తి (90) మృతి చెందారు. సైకాలజీ విభాగ వ్యవస్థాపక సభ్యుడైన ఆయన వయోభారంతో బెంగళూరులో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, పద్మావతీ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున, ఆచార్య కె.లలిత, డాక్టర్ ఎస్ఎస్ సుధారాణి, డాక్టర్ ఎ.గాయత్రి, డాక్టర్ వి.సుబ్రమణ్యం, డాక్టర్ కె.సురేష్, డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, శిష్యులు సంతాపం వ్యక్తం చేశారు. రామ్మూర్తి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



రాజయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ పరిశోధకుడు కె.రాజయ్య డాక్టరేట్ పొందారు. తెలుగులో సాహిత్య లేఖలు - పరిశీలన అంశంపై ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

స్కిట్, మైమ్ పోటీల్లో ద్వితీయ స్థానం



బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ వర్సిటీలో ఈ నెల 8 నుంచి చేపట్టిన జాతీయ యువజనోత్సవాల్లో పద్మావతి డిగ్రీ కాలేజీ విద్యార్థినులు తొమ్మిది మందికి స్కిట్, మైమ్ పోటీల్లో ద్వితీయ స్థానం పొందారు. వీరిని కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

ఎంఎన్‌వోకు ఆర్థికసాయం



పార్థసారథి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో ఎంఎన్‌వోగా పనిచేస్తున్న పార్థసారథి రోడ్డు ప్రమాదంలో గాయపడి రుయా ఆర్ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రి నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.45,500 ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

తిరుపతి (నేర విభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గతనెలలో జరిగిన హత్యకు సంబంధించి నిందితుడిని ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.హత్యకు ఉపయోగించిన రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. బాపట్ల జిల్లా విజయ్‌నగర్ కాలనీకి చెందిన అంకయ్య, శ్రీనివాసులుతో కలిసి మేస్త్రి కృష్ణ ద్వారా టీటీడీ శ్రీనివాసం వద్ద సబ్‌వే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో సతీష్ బాబు, అంకయ్య మధ్య గొడవలు ఏర్పడ్డాయి. దీంతో ఎలాగైనా అంకయ్యను చంపాలని సతీష్ బాబు ప్లాన్ చేశాడు. గత నెల 30వ తేదీన పని జరుగుతున్న ప్రదేశం లోని ఐరన్ షెడ్‌లో నిద్రిస్తున్న అంకయ్య తలపై రాడ్డుతో బలంగా కొట్టి పారిపోయాడు. తోటి పనివారు అంకయ్యను రుయాకు తరలించారు. అక్కడ్నుంచి కుటుంబీకులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పల్నాడు జిల్లా నడిగడ్డ గ్రామం నెలపట్ల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఈస్ట్ సీఐ రామకృష్ణ బుధవారం నిందితుడు సతీష్‌బాబును తిరుపతిలో అరెస్టు చేశారు. కాగా, 2021లో తన భార్య శాంతిని చంపిన కేసులో తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో సతీష్‌బాబు నిందితుడుగా ఉన్నాడు.



అలిపిరి మెట్లోత్సవం



అలిపిరి పాదాల మండపం వద్ద బుధవారం తెల్లవారుజామున మెట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్.ఆనందతీర్థాచార్య మెట్లపూజ నిర్వహించి ఉత్సవం ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మెట్లోత్సవం విశేషాన్ని సభ్యులకు వివరించారు. అనంతరం స్వామి సంకీర్తనలు ఆలపిస్తూ వీరంతా తిరుమల కొండకు నడచి చేరుకున్నారు. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

కన్నుల పండువగా

మాఘ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం మాఘమాస పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుని శ్రీవారి ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





తిరుమల కొండల్లో..

వేడుకగా రామకృష్ణతీర్థ ముక్కోటి





తిరుమల శేషాచల అడవుల్లోని పుణ్యతీర్థాల్లో ఒకటైన శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి బుధవారం వేడుకగా జరిగింది. ప్రతిఏడాది మాఘ మాసంలో పౌర్ణమినాడు శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అర్చక సిబ్బంది మంత్రోచ్చారణ చేసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరి ఉదయం 11 గంటలకు తీర్థానికి చేరుకున్నారు. అక్కడ కొలువై ఉన్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ భగవానుల విగ్రహాలకు పాలు, పెరుగు, చందనం, తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.ఇక తీర్థానికి వెళ్లే భక్తులకు పాపవినాశనం డ్యాం వద్ద పొంగలి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పులిహోర పొట్లాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను శ్రీవారిసేవకులు అందజేశారు. అలాగే టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మార్గ మధ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఇంజినీరింగ్, ఫారెస్ట్ విభాగాలు సౌకర్యాలను కల్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





స్వామి అమ్మవార్లకు, త్రిశూలానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి క్షేత్రంలో..

ఆగమోక్తంగా త్రిశూల స్నానం





త్రిశూలంతో వేదపండితులు

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద స్వర్ణముఖి నదిలో బుధవారం ఆగమోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. మహాశివరాత్రికి 15 రోజుల ముందు మాఘపౌర్ణమి వస్తుంది. ఆ రోజున త్రిశూలస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండు రోజుల ముందు నుంచే స్వర్ణముఖి నదిలో పవిత్రజలాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లు, వినాయక స్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠింపజేసి స్వర్ణముఖి నది వద్దకు తీసుకొచ్చారు. నది వద్ద స్వామి అమ్మవార్లను ఉంచి సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులు కూడా నదిలో మునిగారు. అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, వేదపండితులు, బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

■ నేడు వరల్డ్ రేడియో డే

బుల్లిపెట్టె నేస్తం



● కాలానుగుణ మార్పులను తట్టుకుని.. ఉనికి పదిలపర్చుకుంటున్న రేడియో

రేడియో..ఒకప్పుడు ఇంటిల్లపాదికీ ఆత్మీయనేస్తం.. ప్రభుత్వానికీ ప్రజల మధ్య సమాచార వారధి.. జాతీయ సమైక్యతకు సారథి..కళాకారులకు పెన్నిధి..ఆబాల గోపాలానికి ఆనందాల విందును పంచిన ఈ మాధ్యమం ఇప్పుడు ఉనికి నిలబెట్టుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా బాణీ మార్చుకుంటోంది. తన ప్రియ శ్రోతలను అలరించేందుకు ఆధునికతను అందిపుచ్చుకుంటోంది. వినండి..వినండి.. వింటూనే ఉండండంటూ ఆహ్వానం పలుకుతోంది.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి

సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న రేడియో 1980 దశకం తర్వాత టీవీల రంగప్రవేశంతో నెమ్మదిగా ప్రజాదరణకు దూరమైంది. అందరికీ బంధువుగా నిలిచిన మాధ్యమం ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదురైంది. అయితే కొన్నేళ్లుగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఉనికి పదిలపర్చుకోడానికి కృషి చేస్తోంది. రేడియో డిజిటల్ విప్లవంగా పరిణామం చెందుతోంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్, పాడ్‌కాస్ట్‌లు, ఉపగ్రహ రేడియోల పెరుగుదల రేడియో కంటెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. డిజిటల్ మీడియా పెరుగుతున్నా ఈ బుల్లి మాధ్యమం శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనంగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో, మొబైల్ నెట్‌వర్క్ పనిచేయనప్పుడు రేడియో కీలకమైన సమాచార సాధనంగా ఉపకరిస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రభావిత వర్గాలను చేరుకోవడానికి ప్రభుత్వాలు, ఎన్జీవోలు రేడియోపై ఆధారపడుతున్నాయి. కమ్యూనిటీ రేడియో స్టేషన్లు స్థానిక వార్తలను ప్రసారం చేయడం, సామాజిక సమస్యలను చర్చించడం, స్థానిక సంస్కృతి, సంగీతాన్ని ప్లే చేయడంద్వారా లక్షలాది మందికి రేడియో చేరువవుతోంది. పాడ్‌కాస్ట్‌లు, ఆడియోబుక్‌లు, ఆన్‌లైన్ టాక్ షోలు యువతరాల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికీ ప్రధాని మోదీ మన్‌కీబాత్ పేరిట దేశ ప్రజలతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. కమ్యూనిటీ రేడియో వ్యవస్థ కూడా ఆదరణ పొందగలుగుతోంది.



● చిన్నప్పటి నుంచి రేడియో ప్రభావం

ఆరోతరగతి నుంచీ రేడియోకు అలవాటు పడ్డాం. పాటలు వింటూ స్కూల్‌కు రెడీ అయ్యేవాళ్లం. రాత్రి పాటలు వింటూ పడుకునేవాళ్లం. ఆదివారమైతే రేడియోలో నాటకాలు వచ్చేవి. ఆసక్తిగా వినేవాళ్లం. ఇప్పుడు కూడా ఉదయం నిద్రలేచింది మొదలు డ్యూటీకి రెడీ అయ్యేవరకు రేడియో ఆన్‌లోనే ఉంటుంది. సాయంత్రం ఇంటికి వచ్చాక మళ్లీ రేడియో ఆన్ చేసి ఆకాశవాణి వార్తలు వినడం అలవాటు.

- డాక్టర్ ఏవై లక్ష్మి, ప్రొఫెసర్, స్విమ్స్ రేడియాలజి విభాగం



తిరుపతిలోని ఆకాశవాణి కేంద్రం

● అభిరుచికి అనుగుణంగా మార్పులు



కాలానుగుణంగా అభిరుచి మేరకు కార్యక్రమాలను అందిస్తున్నాం. తిరుపతి ఆకాశవాణి పరిధిలో మంచి శ్రోతలు ఉన్నారు. బయటపడరు. ఉదయం 5.53 గంటలకు సిగ్నేచర్ ట్యూన్‌తో మొదలై 6 గంటలనుంచి ప్రబోధగీతం, వార్తలు, సూక్తిముక్తావళి, పొలం కబుర్లు, ప్రాంతీయ వార్తలు, ఉదయరాగం (సినిమా పాటలు) ఉంటాయి. 7.15 గంటలకు ప్రభాతరేఖల్లో హెల్త్, పొయిట్రీ, షార్ట్ స్టోరీస్, ప్రభుత్వ స్కీమ్స్, ఇంటర్వ్యూ ప్రసారాలు ఉంటాయి. హలో ఆకాశవాణి వాట్సప్ చిత్రం, లిజనర్స్ పాటలు, వనితా లోకం, యువవాణి, బాలానందం,కిసాన్ వాణి వంటి కార్యక్రమాలకు ఆదరణ ఉంది.

- మోహన్ సుధాకర్, ఏడీ, ఆకాశవాణి తిరుపతి

● రేడియో నా నేస్తం

1964నుంచి రేడియో ప్రసారాలు వింటున్నాను. అప్పుడు నా వయస్సు 30 ఏళ్లు. ఇప్పుడు 92 ఏళ్లు వచ్చినా రేడియోను వదలిపెట్టలేదు. అదేనా ఫ్రెండ్. ఉదయం సుప్రభాతంతో మొదలై వార్తలు, నిపుణుల సలహాలు, రాత్రి పడుకునే ముందు లలిత సంగీతం వింటూ పడుకుంటాను. రాష్ట్ర విభజనానంతరం కూడా తిరుపతి రిలే స్టేషన్‌గానే ఉంది. ఇప్పటికైనా మెయిన్ స్టేషన్‌గా మార్చాలి.



- టి.సుబ్బన్న, రైల్వే విశ్రాంత ఉద్యోగి, తిరుపతి

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● రూ.25 లక్షల బంగారు ఆభరణాలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడే ముగ్గురు దొంగలను తిరుపతి, తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు నగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెహిదీపట్నంకు చెందిన సుధాకర్ అలియాస్ ఆంథోని, రంగారెడ్డి జిల్లాకు చెందిన పిల్లిశేఖర్, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గాజులపల్లి శ్రీనివాసులురెడ్డి మంచి స్నేహితులు. వీరిలో సుధాకర్‌పై 100కుపైగా, పిల్లి శేఖర్ పైన 160కిపైగా దొంగతనం కేసులున్నాయి. ఈ ముగ్గురు కలిసి ఇటీవల తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లె పంచాయతీ తిరుమల నగర్‌లోని రవి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, నగదు అపహరించుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకునేందుకు తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, ఎస్ఐలు అరుణ, జగన్నాథరెడ్డి, సాయినాథ్ చౌదరి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు బుధవారం తిరుపతి ఆర్టీవో కార్యాలయం వద్ద తిరుగుతున్న సుధాకర్, పిల్లి శేఖర్,గాజులపల్లి శ్రీనివాసులురెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువ చేసే 277 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన తిరుచానూరు సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని అభినందించారు.

టీటీడీ ఏడీ భవనం ఎదుట సాధువుల నిరశన దీక్ష



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి జూపార్కు రోడ్డులో నిర్మాణం చేపడుతున్న ఒబెరాయ్ హోటల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని బుధవారం కొందరు సాధువులు టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరశన దీక్షకు దిగారు. టీటీడీ పాలకమండలిలో ఒబెరాయ్ హోటల్ రద్దు చేస్తున్నట్లు తీర్మానించారని, అయినా అక్కడ పనులు చురుగ్గా జరుగుతున్నాయని శ్రీనివాసానందసరస్వతి తెలిపారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తిరుమల ప్రవిత్రతను నాశనం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వారాహి డిక్లరేషన్, సనాతన ధర్మరక్షణ బోర్డును తీసుకొస్తామని తిరుమల క్షేత్రంలో చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. ఈ విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. జనసేన హస్తం ఉందికాబట్టే హోటల్ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోందన్నారు. దీనిని రద్దు చేసేంతవరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు.

ముగ్గులేసిన మహిళలకు రూ.5.56 లక్షల పంపిణీ

చంద్రగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజున సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు రూ.10,116 చొప్పున రూ.5,56,380 బుధవారం పంపిణీ చేశారు. ఏటా నారావారిపల్లెలో ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు గ్రామాల మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలను భువనేశ్వరి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేస్తారు. గతనెలలో ముగ్గుల పోటీల్లో 55మంది ముగ్గులు వేశారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం టీటీడీ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.10,116 వంతున వారందరికీ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోదండరామానాయుడు, వైకుంఠం శ్రీధర్‌నాయుడు, సర్పంచ్ భర్త గిరినాయుడు, నిరంజన్‌నాయుడు, శేఖర్‌నాయుడు, కుమార్, వల్లూరి శ్రీకాంత్‌చౌదరి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొని.. నగదు బహుమతి అందుకున్న మహిళలు

ఆహ్లాదం కోసమే నగర వనం: కురుగొండ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు ఆహ్లాదక వాతావరణాన్ని అందించేందుకే నగర వనం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక తిరుపతిలో రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో నగర వనం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పట్టణ ప్రజలకు ఆహ్లాదక వాతావరణాన్ని అందించేందుకే 74 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇందులో వాకింగ్ ట్రాక్, రన్నింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అటవీశాఖ ఇలాంటివి కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సీఎఫ్ సెల్వం, డీఎఫ్‌వో వివేకర్, రేంజర్ లోకేష్, డీఆర్‌వో ప్రతాప్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాంబాబు, ఎంపీడీవో కోటేశ్వరరావు, ఎంపీపీ తనూజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చే వరకు భూములివ్వం



రోడ్డు పనులను అడ్డుకున్న రైతులతో చర్చిస్తున్న అధికారులు

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సాగరమాల రోడ్డు విస్తరణకు భూములిచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదని, పరిహారం ఇచ్చే వరకు భూముల్లోకి దిగనివ్వబోమంటూ రైతులు రోడ్డు పనులు అడ్డుకొని వాహనాలను నిలిపివేశారు. ఈ ఘటన బుధవారం కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెంలో జరిగింది. రైతుల కథనం మేరకు వివరాలు... సాగరమాల రోడ్డు విస్తరణ కోసం నెల్లూరుపల్లి, కొత్తపాళెం, విశ్వనాథపురం అగ్రహారం గ్రామాలకు చెందిన రైతుల భూములు తీసుకున్నారు. అయితే చిన్నచిన్న లోపాల కారణంగా పరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులను అడ్డుకున్న విషయం తెలుసుకున్న తహసీల్దారు జయజయరావు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకొని ఆందోళన చేస్తున్న రైతులకు సర్దిచెప్పారు. కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు.

మోడల్ పాఠశాల ఎంపికలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శైలజ

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరానికి మోడల్ పాఠశాల ఎంపికకు శ్రీకారం చుట్టిందని, ఇందులో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని ఎంఈవోలు శైలజ, మస్తానయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మోడల్ పాఠశాలల ఎంపికపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధునాతన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం పాఠశాలల ఎంపిక, అభివృద్ధిలో తల్లిదండ్రుల సహకారాన్ని తీసుకోవాలన్నారు.

వెంకయ్యస్వామి ఆలయ ముఖద్వారానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్టలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు భూమిపూజ చేశారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు వెంకయ్యస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖద్వార నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖద్వార నిర్మాణానికి టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ రూ.10 వేల చొప్పున విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, మేడా సాయినారాయణ, కుదిరి పెంచలయ్య, కొమరంజేరి శ్రీధర్, కొండల్‌రావు, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుజిత

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. నెల్లూరుకు చెందిన డాక్టర్ సుజిత ఆధ్వర్యంలో మానసిక ఒత్తిళ్లు, వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒత్తిడిని జయిస్తే ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ ఉదయకుమార్, డాక్టర్ హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న బర్డ్‌ఫ్లూ

తగ్గిన చికెన్, గుడ్ల విక్రయాలు

గూడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్, కోడి గుడ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. వారం రోజులుగా పలు రాష్ట్రాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో కూడా బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు ప్రచారం జరగడంతో చికెన్ ధరలు పడిపోయాయి. గూడూరు సమీప ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు లేకపోయినా ప్రతిరోజూ చిత్తూరు జిల్లా నుంచి మాంస దుకాణాలకు కోళ్లు సరఫరా అవుతుంటాయి. గూడూరు పట్టణంలో సుమారు 20కు పైగా మాంస దుకాణాల్లో రోజుకు 3వేల కిలోల కోడి మాంస విక్రయాలు జరుగుతుంటాయి. వారం రోజులుగా బర్డ్‌ఫ్లూ వైరస్ సోకడంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని ప్రచారం జరుగుతుండంతో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. ధరలు తగ్గకుండా నిలకడ గానే ఉన్నా విక్రయాలు మాత్రం పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు.

భూముల పరిశీలన

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 95111లోని పది ఎకరాల భూములను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా బుధవారం పరిశీలించారు. తహసీల్దారు రామయ్య, మండల సర్వేయర్ శకుంతలతో మాటాడి భూముల వివరాలను తెలుసుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ అఖిల్‌యాదవ్, సర్వేయరు శ్రీలత, వీఆర్వో కాటమ్మ ఉన్నారు.

ఏ బస్సు ఎప్పుడు.. ఎక్కడికెళ్తుందో!

- రాత్రికి రాత్రే మారిపోతున్న బస్సుల వేళలు
- తరచూ సర్వీసుల రద్దుతో ప్రయాణికులు, సిబ్బంది తికమక
- సూళ్లూరుపేట డిపోలో గాడితప్పిన పాలన



సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో పాలన గాడితప్పింది. కొంతమంది సిబ్బందే అధికారుల అవతారం ఎత్తి రాత్రికి రాత్రే బస్సుల వేళలను ఇష్టానుసారంగా మారేస్తున్నారు. ఆర్డినరీ బస్సులు ఎక్స్‌ప్రెస్‌లుగా, ఎక్స్‌ప్రెస్‌లు ఆర్డినరీగా తిరగాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ సర్వీసు ఎక్కడికి పోతుందో తెలియక సిబ్బందితో పాటు ప్రయాణికులు తికమక పడుతున్నారు.

రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సూళ్లూరుపేటలో 1998లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్టీసీ డిపోను ప్రారంభించారు. తొలినాళ్లలోనే ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభించడంతో డిపో లాభాల బాటలో నడిచింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారు. అధికారులు, సిబ్బంది వైసీపీ నాయకులతో అంటకాగి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. టీడీపీకి అనుకూలమైన గ్రామాలుగా పేరొందిన వాటంబేడు, ఎస్ఎంకండ్రిగ, జీలపాటూరు, ఉచ్చూరు, వేణుంబాక, రేసనూరు సర్వీసులను పూర్తిగా ఎత్తివేశారు. అప్పట్లో డిపోలో 60 సర్వీసులుండగా ప్రస్తుతం కేవలం 28సర్వీసులే నడుస్తున్నాయి. గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాలకు బస్సులు లేకుండా పోయాయి. జిల్లా కేంద్రమైన తిరుపతికి పూర్తిగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులే నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల బస్సులు నడపాలని ప్రజలు పలుమార్లు డిపో అధికారులకు విన్నవించుకొన్న పట్టించుకోలేదు. దీంతో ప్రైవేట్ వాహనాలు, ఆటోలే దిక్కయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్టీసీ డిపో బాగుపడుతుందని అందరూ భావించారు. అయితే ఇప్పుడు కూడా వైసీపీకి అంటకాగిన అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి మారలేదు. తాజాగా తడ - నెల్లూరు మధ్య తిరుగుతున్న అల్ట్రా పల్లె వెలుగు బస్సులను ముందస్తు సమాచారం ఇవ్వకుండానే రద్దు చేశారు. అదే షెడ్యూల్‌తో ఆ సర్వీసులను వివిధ ప్రాంతాలకు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారు. కోట, తిరుపతి, నెల్లూరు మార్గాల్లో తరచూ బస్సులను రద్దు చేస్తున్నారు. ప్రయాణికులు అడిగినా సరైన సమాధానం లేదు. ఇదిలా ఉండగా డిపోలో ఉన్నతాధికారుల అనుమతి పలువురు కండక్టర్లు, డ్రైవర్లు వారి విధులకు డుమ్మాకొట్టి సూపర్‌వైజర్లు, అధికారులుగా చెలామణి అవుతున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఇక డిపోలో లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ నిద్రపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో పూర్వ వైభవానికి చర్యలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్

గూడూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చునని రవాణాశాఖ అధికారి కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక పోటుపాళెంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలను నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు జకీర్‌అహ్మద్, సునీల్, ఏఎంవీఐ శాంతి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ముగిసి నెలరోజులు కావస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంపై నివేదికలు స్పష్టంగా రాలేదని, ఇలాగే వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన హెచ్చరించారు కోట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల పరిష్కారంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్ష జరిగింది. మండలంలోని 21 పంచాయతీల వారీగా వచ్చిన అర్జీలు, పరిష్కరించిన వాటి వివరాల గురించి సబ్ కలెక్టర్ ప్రశ్నించారు. కొన్ని పంచాయతీల్లో తక్కువ అర్జీలు వచ్చినప్పటికీ, పరిష్కరించిన వాటి సంఖ్య ఎక్కువగా చెప్పడంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలనుంచి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దారు జయజయరావు, డిప్యూటీ తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్, ఆర్ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 15,16 తేదీల్లో నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈవో రవికృష్ణ తెలిపారు. 500 సంవత్సరాలకు ముందు నిర్మించిన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహాయంతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ హరి, అర్చకులు సోమశేఖరశర్మ, వీఆర్వో బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ - కార్యాలయంతో పారదర్శకత



ఈ-కార్యాలయ నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ - కార్యాలయంతో పారదర్శకత రికార్డులను పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించవచ్చని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూళ్లూరుపేట డివిజన్ స్థాయి రెవెన్యూ సిబ్బందికి ఈ- కార్యాలయ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈ - కార్యాలయ నిర్వహణ ద్వారా సిబ్బందితో పాటు ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



తాళ్వాయిపాడులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో రవీంద్రబాబు

పెళ్లకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్పీవో రవీంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్పీవో మాట్లాడుతూ మండలంలో ఉన్న 20 చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాల్లో సేకరించిన తడి, పొడిచెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరడంతో పాటు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ మంత్రిని కలిసిన వేనాటి



మంత్రి బీసీ జనార్థనరెడ్డితో వేనాటి సతీష్ రెడ్డి, కందల కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్థనరెడ్డిని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాయుడుపేట పట్టణ, రూరల్ అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి, కామిరెడ్డి అశోక్ రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి మంత్రికి వివరించారు. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టీడీపీ చెప్పారు.

కార్పొరేషన్ రుణాలకు 422 దరఖాస్తులు

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు పొందేందుకు వాకాడు మండలంలో 422 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండలానికి మొత్తం 34 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు.

తడ: కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలు పొందేందుకు తడ మండలంలో 63 యూనిట్లకు 159 దరఖాస్తు అందాయని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆయన చెప్పారు.

గ్యాంగ్‌మెన్‌కు భద్రత కల్పించాలి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ట్రాక్, గ్యాంగ్‌మెన్‌కు భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న సెక్షన్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఆ విభాగానికి చెందిన ఉద్యోగులు నిరసన తెలిపారు. మంగళవారం తడ మండలం అనపగుంట వద్ద విధి గ్యాంగ్‌మెన్‌లు నిర్వహణలో ఉండగా రైలు ఢీకొని ఒకరి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని గ్యాంగ్‌మెన్‌లు ఆరోపించారు. గ్యాంగ్‌మెన్‌లు ట్రాక్‌పై పనిచేసే సమయంలో రైళ్ల రాకపోకల సమాచారం ఇస్తూ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ భద్రత లేకపోతే తాము విధులకు హాజరుకాబోమని చెప్పారు.

పాఠశాలలో డైనింగ్ హాల్‌కు భూమిపూజ



డైనింగ్‌హాల్‌కు భూమిపూజ చేస్తున్న రాజగోపాల్, కృష్ణారావు

నాయుడుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ ఏర్పాటుకు బుధవారం రోటరీక్లబ్ అధ్యక్షుడు జె.రాజగోపాల్, మునగాల కృష్ణారావు భూమిపూజ చేశారు. డైనింగ్ హాల్ ఏర్పాటుకు అమెరికాలోని బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజింగ్ క్లబ్ సభ్యులు సహకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాదలూరు సంజాయ్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, ఉదయ శంకర్, నాగూరయ్య, బట్టా సుబ్రహ్మణ్యం, చెంచయ్య పాల్గొన్నారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి జయశ్రీదేవి

తడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడులో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం వైద్యాధికారి జయశ్రీదేవి తనిఖీ చేశారు. మందులతో పాటు రోగుల వివరాల రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, వారిలో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజకుమారి, సిబ్బంది సరస్సు, శివరంజని పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న వైద్యాధికారిణి రూప

కోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఆర్టీసీ కార్మికులు రక్తదానం చేశారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని వాకాడు ఆర్టీసీ డీఎం పెంచలయ్య ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాతలను డాక్టర్ రూప, డీఎం పెంచలయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, కంట్రోలర్ జార్జి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామాపురం పంచాయతీలో రూ.10 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో విజయ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ దిలిప్, సర్పంచు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధికి ఈకేవైసీ తప్పనిసరి

పెళ్లకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ లబ్ధి పొందడానికి ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ అన్నారు. బుధవారం మండలంలోని పునబాక, తాళ్వాయిపాడు రైతు సేవా కేంద్రాల్లో ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతూ ఈకేవైసీ, ఎన్పీసీఐ లింకు చేసుకొని రైతు సేవా కేంద్రాలు, సీఎస్సీ సెంటర్‌లకు వెళ్లి ఏపీఎఫ్ఆర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ దినేష్ తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సొంత పొలం కలిగిన రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏవో రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని వెందోడు, పాలిచెర్ల గ్రామాల్లోని రైతేసేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు త్వరతగతిన రైతులకు అందుతాయన్నారు. కార్యక్రమంలో శివ, చక్రి తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో మాఘ పౌర్ణమి వేడుకలు



కలశ స్థాపన చేస్తున్న వేదపండితులు, సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయంలో బుధవారం మాఘమాస పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయం ఎదుట 108 కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలను భక్తులు ఆలయం చుట్టూ ప్రదర్శనగా తీసుకొచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి వేద పండితులు, మంత్రోచ్ఛరణల నడుమ మహాచండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. రామ్‌కుమార్ రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

వాకాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించి టైమ్‌స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవ, ఇంద్రప్రసన్న, కస్తూరయ్య, రాజ్‌కుమారి, ధావిదు, సుబ్బయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నాయుడుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మెప్మా, పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి పొడి, తడి చెత్త వేర్వేరుగా అందజేసేలా అవగాహన కల్పించాలని కమిషనర్ అన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్, సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. తప్పకుండా రావాలని ఆహ్వానించారు. అదే విధంగా గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు కూడా ఆహ్వానించారు.

ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు సన్మానం


అధికారులు, ఉద్యోగులను సన్మానిస్తున్న యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచి గణతంత్ర దినోత్సవం రోజు ఉత్తమ అవార్డును అందుకున్న తొట్టంబేడు మండల అధికారులు, ఉద్యోగులను బుధవారం యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంపీడీవో రఫీఖాన్, తొట్టంబేడు ఎంపీడీవో సురేంద్రనాథ్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, యూనియన్ బ్యాంకు మేనేజరు హరికృష్ణ, న్యాయవాది వీరరాఘవరెడ్డి, సంస్థ అధ్యక్షులు హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై శిక్షణ


మాట్లాడుతున్న పంచాయతీ అధికారి సుశీలాదేవి

రేణిగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడి పంచాయతీ ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్ వద్ద బుధవారం తడి, పొడి చెత్త నిర్వహణపై శిక్షణ తరగతులు జరిగాయి. రేణిగుంట, ఏర్పేడు మండలాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులకు, ఈవోపీఆర్డీలకు, నూతనంగా వచ్చిన కార్యదర్శులకు ఈ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సేంద్రీయ ఎరువుల తయారీకి కృషి చేయాలని సూచించారు. వర్మికంపోస్టు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్సీ శిరీష, ఈవోపీఆర్డీలు ప్రభురావు, రమేష్, డీఎల్‌పీవో ప్రభురెడ్డి, డీఆర్పీలు భరత్, కిషోర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చక్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


చక్రేశ్వరస్వామి ఆలయంలో శివలింగాకృతి దీపార్చన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ గుడివీధిలో వెలసిన చక్రేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణంలో శివలింగాకృతితో ఏర్పాటు చేసిన దీపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ముత్యాలమ్మ ఆలయంలోని అమ్మవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు.

కెనరా బ్యాంకు కరకంబాడి బ్రాంచి ప్రారంభం


కరకంబాడి బ్రాంచిని ప్రారంభిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

రేణిగుంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని పాత చెక్‌పోస్టు సమీపంలో నక్షత్ర ఫంక్షన్ హాల్ పక్కన కెనరా బ్యాంకు కరకంబాడి బ్రాంచిని బుధవారం ఆ బ్యాంకు తిరుపతి సర్కిల్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయ ప్రారంభించారు. ఖాతాదారుల ప్రాముఖ్యత, బ్యాంకు సేవల గురించి తిరుపతి రీజనల్ కార్యాలయ ఏజీఎం టి.నాగరాజరావు వివరించారు. ఈ సందర్భంగా పలువురికి రుణాలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రీజనల్ కార్యాలయం డీఎంలు శరవణకుమార్, శరవణకృష్ణ, శ్రీహర్ష, బ్యాంకు సీనియర్ మేనేజర్ సిద్ధయ్య, మేనేజర్ ఎస్.భాస్కర్, ఏఈవో నళిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

- భార్యకు స్వల్పంగా...


గాయపడిన ప్రసాద్, వెన్నెల

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో భర్తకు తీవ్రగాయాలు కాగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఉడమాలపాడు గ్రామానికి చెందిన ప్రసాద్(35) భార్య వెన్నెలతో కలసి వరదయ్యపాళెం మండలానికి చెందిన సంతవేలూరు గ్రామానికి బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై బుధవారం బయల్దేరారు. మండలంలోని పార్లపల్లి వద్ద ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు ప్రసాద్, వెన్నెలను శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

15న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ శనివారం పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ పట్టాభి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో పలు బహుళ జాతీయ కంపెనీలు పాల్గొననున్నట్లు వివరించారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్, ఐటీఐ, బీటెక్, డిప్లమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువత అర్హులన్నారు. యువతీ యువకులు తమ ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్సులు, బయోడేటాతో పాటు జాబ్‌కార్డుతో మేళాకు ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 79895 09540, 89198 89609 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టీడీపీ నేత మనోహర్ మృతి


మనోహర్ (ఫైల్ ఫొటో)

పిచ్చాటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి కొడియంబేడు గ్రామానికి చెందిన టీడీపీ నేత మనోహర్ పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్సీసెల్ మండల శాఖ అధ్యక్షుడిగా, గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయనపై నెల రోజుల క్రితం పాత కక్షల కారణంగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పిగా ఉందని బంధువులకు తెలపడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలపడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. టీడీపీ నేత కావడంతో పలువురు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు.

పాలిటెక్నిక్‌ను సందర్శించిన రాష్ట్ర సాంకేతిక విద్యా కమిటీ

సత్యవేడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ను రాష్ట్ర సాంకేతిక ఉన్నత విద్యా కమిటీ బుధవారం సందర్శించారు. ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బ్రాంచ్ ఎన్‌బీఏకు అర్హత సాధించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ సుబ్బారెడ్డి కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. జాతీయ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ల్యాబ్‌ను ఆధునికీకరించాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రిజ్వాన్‌కు సూచించారు. కళాశాల కోఆర్డినేటర్ ప్రకాష్ నారాయణ, అధ్యాపకులు భరత్, ప్రభాకర్, జ్యోత్స్న పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్‌తో దాడి

సత్యవేడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమ స్థలంలో అక్రమంగా ప్రవేశిస్తుండటాన్ని అడ్డుకున్నందుకు గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమారుడిపై ఎక్స్‌కవేటర్‌తో దాడి చేసేందుకు ప్రయత్నించి, గాయపర్చారని మండలంలోని ఏఎంపురం గ్రామానికి చెందిన మల్లిక బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు... మల్లిక కుటుంబానికి పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన స్థలంలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఎక్స్‌కవేటర్‌తో దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమణకు పాల్పడటంతో అడ్డుకున్నట్లు తెలిపారు. శ్రీనివాసులుతో పాటు అల్లాస్వామి, చరణ్ తమపై దూషణలకు పాల్పడుతూ దాడికి యత్నించారని తెలిపారు. ఎక్స్‌కవేటర్‌ను ఆపరేటర్ సాయంతో తన కుమారుడు హుసేన్‌పై దాడికి ప్రయత్నించారన్నారు. ఈఘటనలో తన కుమారుడి కాలికి గాయమైందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

- అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే కేంద్రాల నిర్వహణ
- ఇబ్బందుల్లో విద్యార్థులు


వేములపూడిలో - గిలక సముద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలు

కేవీబీపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ఐదు సంవత్సరాలుగా చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. మండలంలో మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటిలో 30 మాత్రమే సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగిలిన 31లో 9 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. 22 గ్రామాల్లో ఖాళీగా ఉన్న పాఠశాల భవనాలు, పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాత భవనాల్లో నిర్వహిస్తున్నారు. కొన్నింటిలో విద్యుత్ సరఫరా లేదు. మరికొన్నింటిలో నీటి సరఫరా లేదు. దీంతో ఈ అద్దె భవనాల్లో విద్యార్థులకు అగచాట్లు తప్పడంలేదు. 2014-19 టీడీపీ హయాంలో పునాదులు వేసిన గిలకసముద్రంలోని అంగన్‌వాడీ భవనాన్ని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలపై కక్ష కట్టి బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. ఇప్పటికీ అద్దె భవనాల్లోనే 9 కేంద్రాలు నడుస్తున్నాయి. పీవీ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రం ప్రాథమిక పాఠశాలలోని ఖాళీ భవనంలో నిర్వహిస్తున్నారు. ఆ భవనం కింద ఫ్లోరింగ్ కుంగి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేటీ రోడ్డుపై మట్టి తొలగించండి


కేటీ రోడ్డు చెక్ పోస్టు దగ్గర, రైస్‌మిల్ సమీపంలో రోడ్డుపై ఉన్న మట్టి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డుపై వేసిన మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కేటీ రోడ్డుకు ఒక వైపున శ్రీకాళహస్తి నుంచి గ్యాస్‌కు సంబంధించిన పైపులైను వేస్తున్నారు. పైపులైను కోసం తీస్తున్న గుంతల్లోని మట్టిని రోడ్డుపై వేయడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. రాత్రి వేళల్లో అనేక వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ పైపులైను పనులు అనేక గ్రామాల దగ్గర నత్తనడకన జరుగుతుండడంతో వాహనదారులతో పాటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఒక చోట తీసిన గుంతలు పూర్తి చేయకుండా మరో చోట పనులు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

- ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఎక్స్‌లేటర్, ట్రాక్టర్లు

రేణిగుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతోపాటు ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులను గాజులమండ్యం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కొత్తమంగళం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారనే సమాచారంతో బుధవారం సాయంత్రం పోలీసులు అకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నది నుంచి ఇసుకను అక్రమంగా తీసుకొస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అలాగే నదిలో ఇసుకను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ రవాణాకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించండి

రేణిగుంట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి మణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చెత్త నుంచి సంపద తయారీ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. వ్యర్థాలను మురికినీటి కాలువలు, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. ఈ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి సహకరించాలని కోరారు. ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, లైసెన్సు పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మునీంద్ర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో రెండవ వార్డులో కాపురం ఉంటున్న దొడ్ల మునీంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి మునీంద్ర ఇంటి వద్దకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న వారికి ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, మిన్నల రవి, సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను రెండవ ఎంఈవో మునిసుబ్రమణ్యం బుధవారం సాయంత్రం పరిశీలించారు. విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారం తరువాత పరీక్షలు నిర్వహించాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో ప్రగతి పరుగులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 12: పల్లె పండుగతో ప్రగతి పరుగులు తీస్తుందని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వరదయ్యపాళెం మండలానికి ప్రభుత్వం పల్లె పండుగ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.44లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. పనులు త్వరలో పూర్తిచేస్తామన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఆలయంలో క్యూలైన్లను పరిశీలించి, తొక్కిసలాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాడవీధుల్లో పర్యటించి భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బందోబస్తుపై సూచనలు చేశారు. పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. వాహనాల రద్దీ పెరిగితే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ హేమంత్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

25 నుంచి త్రయంబకేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలో వెలసిన త్రయంబకేశ్వరాలయంలో ఈ నెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ పాలకమండలి బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

పుత్తూరు వార్తలు

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య


ఉత్తరపుకండ్రిగలో రైతు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా బుధవారం పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగలో రైతు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వ్యవసాయధికారి కోదండయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూయజమానులు తప్పనిసరిగా ఈ గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు. ఈ సంఖ్యకు రైతులు సీజన్‌లో పొందే సబ్సిడీలు, రుణాలు, పంటల బీమా వంటి పథకాలు, పీఎం కిసాన్ పథకం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలు అనుసంధానం చేయబడుతాయని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంక్ లింకేజికి సంబంధించిన ఆర్థిక సేవలు, పంటల కనీస మద్దతుధర పొందే విధంగా రైతులకు సౌలభ్యం ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నమోదు జరుగుతుందని, ప్రతి రైతు నమోదు చేసుకుని 11 అంకెల గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు.

పుత్తూరులో 'చెత్త' నిర్వహణ

- జనాభా ఎక్కువ, పారిశుధ్య సిబ్బంది తక్కువ
- చెత్త సేకరణ వాహనాల లేమి సమస్య
- తడుకు పంచాయతీలో అభ్యంతరం.. కంపోస్టు యార్డు మూత


కార్వేటినగరం రోడ్డులోని రామారావు కాలనీలో చెత్త నిల్వ

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో చెత్త నిర్వహణ రోజురోజుకు దిగజారుతోంది. రహదారుల వెంట చెత్త పేరుకుపోవడంతో ప్రజలు దుర్గంధం నడుమ జీవనం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు అవగాహన రాహిత్యంతో చెత్తను ఎక్కడబడితే అక్కడ పారవేస్తున్నారు. అధికారులు, ప్రజల సమన్వయంతో ముందుకు సాగితే ఫలితం ఉంటుంది.

ఇదీ పరిస్థితి

పుత్తూరు పట్టణం 36.5 కిలోమీటర్ల విస్తీర్ణం ఉండగా, 65 వేల మంది జనాభా నివసిస్తున్నారు. రోజుకు 24 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో తడి చెత్త 14 టన్నులు, పొడి చెత్త 10 టన్నులుగా సేకరిస్తున్నారు. పట్టణ పరిధిలో 500 మంది జనాభాకు ఒక్క పారిశుధ్య కార్మికుడు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కాగా, ప్రస్తుతం 74 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో మేస్త్రీలు ఐదుగురు, ముగ్గురు ఆఫీసులో పనిచేస్తున్నారు. 16 మంది స్వీపింగ్ చేస్తుంటారు. పుష్‌కాట్‌ల ద్వారా చెత్త సేకరణకు 21మంది, లోడర్స్‌గా 16మంది, డ్రెయిన్ క్లీనింగ్‌కు 10మంది, డ్రైవర్లుగా 5మంది ఉన్నారు. పారిశుధ్య సిబ్బంది పుష్‌కాట్‌ల ద్వారా చెత్త సేకరణ చేస్తున్నప్పటికీ చాలా మంది రోడ్లపై చెత్త వేస్తుండటం దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. తడి, పొడి, బయో మెడికల్ వేస్ట్‌ను వేసుకునేందుకు వీలుగా ఇంటింటికి మూడు డస్ట్ బిన్‌లను గ్రీన్, బ్లూ, రెడ్ కలర్‌ల చొప్పున 9,800 అందజేశారు. అయినా చాలా మంది వాటిని పూర్తిగా వినియోగించడం లేదు. శానిటరీ సూపర్‌వైజర్ స్థాయి అధికారి లేకపోవడంతో సచివాలయ సిబ్బందిని నియమించి పారిశుధ్య పనుల పర్యవేక్షణ చేయిస్తున్నారు. కాగా చెత్తసేకరణకు కంపాక్టర్ వాహనాలు రెండు ఉన్నాయి. ఒకటి చిన్నది, ఒకటి పెద్దది ఉన్నాయి. ఈ వాహనాలు డంపర్‌బిన్‌ల నుంచి చెత్తను సేకరిస్తాయి. మూడు ట్రాక్టర్లు, మూడు ఈ-ఆటోలు మాత్రమే చెత్తను సేకరిస్తున్నాయి. ఈ వాహనాలతో ఏపాటి చెత్తను సేకరిస్తారో అర్థమవుతుంది. 10 ఈ-ఆటోలు నిర్వహణకు నోచుకోక మూలనపడ్డాయి.

తడి, పొడి ఒక్కటిగానే..

నివాసాలు, దుకాణాల నుంచి సేకరించిన చెత్తను వేరుచేయకుండా డంపుయార్డులో తడి, పొడి చెత్త ఒకే దగ్గర గుట్టలుగా పోయడంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. కొందరు పారిశుధ్య వాహనాల చోదకులు ఇష్టానుసారంగా డంపుయార్డు దారిలోనే పారబోస్తున్నారు. దీంతో వెనుకవచ్చే వాహనాలు లోపలికి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో వారు సైతం ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. సేంద్రియ ఎరువుగా మార్చే పద్ధతికి మంగళం పాడారు. తడుకు వద్ద రూ.లక్షలు వెచ్చించి కంపోస్టుయార్డు ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పంచాయతీ పాలక సభ్యుల నుంచి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ చెత్త నుంచి ఎరువుల తయారీ ప్రక్రియ నిలిపేశారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు చెత్త సేకరణ, నిర్వహణ పట్ల దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.